కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ

# ఎండమావి

"దండం బాబయ్యా". జీరగొంతుకతో అంటూ వినమ్రంగా చేతులు జోడించి నిలబడింది బూబమ్మ.

వీధి అరుగుమీద తీరిగ్గా కూర్చుని కబుర్లాడుతున్న నలుగురూ బూబమ్మకేసి చూశారు.

బోసినోటిని చప్పరిస్తూ దీనంగా వాళ్లకేసి చూస్తున్నదామె. తలభారాన్ని మోయలేక మోస్తున్నట్లుగా మెడ వణుకుతున్నది. నడుం వంగబడి, పోటుకర్ర ఊతం గనుక లేకపోతే



ఆ మనిషి కుప్పకూలి పోతుందేమోనన్నంత బలహీనంగా వున్నది. ఎడారి ఇసుక మీద గాలి గీసిన గీతల్లా ముఖంమీద వృద్ధాప్యపు చారలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

"ఎందే బూబు!" అన్నాడొక ఆసామి కరుగ్గా.

బోసినోటిని దబదబా చప్పళించి. "పావులా ధర్మంచేయండి బాబుగారూ!" అడిగింది హీనస్వరంతో.

"ఎందుకే...చుట్టపీకలకా?" గద్దించాడు మరొకతను.

"చుట్టపీకలకి డబ్బులడుక్కుంటానా బాబయ్యా!"

"మరెందుకే నీదెవసానికి, ఇళ్లంట వెళ్లి ఒక ముద్ద అడుక్కుని చావక" కసిరాడు.

"దయచూడాలి! దిక్కు మొక్కు లేని నాబోటి ముసలోల్లకి సర్కారోల్లు పింఛనిత్తన్నారంట."

"అయితే డబ్బులెందుకు?"

"ఫుటో పంపించాలంట. తీయించుకోటానికి డబ్బులుకావాల. దయగల మారాజుల్ని అడుక్కుంటన్నా" అన్నది బూబమ్మ.

ఒకతను ఫకాల్న నవ్వేడు.

"నువ్వు ఫోటో దిగాలన్నమాట!"

"మరే బాబు! లేకపోతే డబ్బు లియ్యరంట." నిరాశగా చెప్పింది.

"ఫోటోలు దిగి పింఛను తెచ్చుకొని, బతికి ఎవర్ని వుద్ధరించాల్నే?" అడిగాడు ఒకాయన.

"ఆ పిలుపుకోసం ఎదురుసూత్తానే వున్నా! దేవుడికి ఇంకా నా మీద దయకలగలా! నాలుగిళ్లు తిరిగి అడుక్కోటానికి కూడా సత్తువ వుండటంలా." బూబమ్మ కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి.

నలుగురిలో ఒకతను, జాలే కలిగిందో లేక ఇచ్చేవరకూ దయ్యంలా పట్టుకుని పీడిస్తూనే వుంటదనోగానీ జేబులో నుండి పావలాకాసు తీసి బూబమ్మ చేతిలో పడేశాడు.

కంటిచూపు కూడా అంతంతమాత్రం గావటంతో చేతివేళ్లతో తడిమి పావలాబిళ్లని పసిగట్టి, ఆ మాత్రానికే సంతోషపడింది.

"మారాజు సల్లంగుండాలి" అంటూ గొణిగి, "బాబూ! మీరూ సాయం సేయండి" అన్నది ఆశగా చేయిజాస్తూ.

"ఇచ్చింది చాల్లే. చిల్లర లేదు వెళ్లెళ్లు." కసిరేసరికి ఉలిక్కిపడింది.

తిరిగి అడిగే ధైర్యం లేక మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇవతలికి నడిచి బొడ్లో దాచుకున్న గుడ్డసంచి బయటకు లాగింది. చిల్లర గల్లుమన్నది. జాగ్రత్తగా పావలాకాసు సంచిలో వేసి బొడ్లో దోపుకున్నది.

మధ్యాహ్నందాకా బూబమ్మ వూరిలో వీధివీధికి తిరుగుతూ తారసపడిన వారినల్లా సహాయంకోసం అర్థిస్తూనే వున్నది. ఇచ్చిన వారికన్నా కసిరి గొట్టినవారే ఎక్కువ.

బొంగరంలా తిరుగుతూ ఆయాసంతో నీడపట్టున కాసేపు కూలబడింది. జివజివమని కాళ్లు లాగుతుంటే చేతుల్తో వత్తుకుంది.

దిక్కులేని ముసలివాళ్ళకు ప్రభుత్వం పింఛను ఇవ్వబోతున్నారన్న విషయం బూబమ్మకు చాల ఆలస్యంగా తెలిసింది. అప్పటికే వూరిలోని చాలమంది దరఖాస్తులు పంపుకున్నారు.

పాత మునసబు చిన్నయ్య అందరి దరఖాస్తులు పూర్తిచేసి పంపేదని చెప్తే, పడుతూ లేస్తూ అతనింటికి వెళ్లింది బూబమ్మ.

"బాబూ! ముసలిముండని దయసూడాలి" అన్నది చేతులు జోడించి.

"ఏంది బూబమ్మా?"

"ముసలోల్లకి పింఛనిత్తన్నారంట. నాక్కూడా ఇప్పించు.... సచ్చి నీ కదుపున పుడ్తా".

"ఇప్పటిదాకా ఎక్కడ చచ్చేవ్! అందరికీ రాసి పంపేశాం". చిరాకుపడ్డాడు చిన్నయ్య

"నా కియ్యాలే తెలిసింది బాబూ!"

"ఇప్పుడొస్తే నేనేం చెయ్యగలను. కుదరదు....వెళ్ళు". అన్నాడు గట్టిగా.

అతని మాటలకు బూబమ్మ కృంగిపోయింది.

"బాబయ్యా! కట్టుకున్నోడు అల్లా కొలువుకెల్లిపోయాడు. నలుగురు బిడ్డలు నాలుగు దిక్కులయ్యారు. ఈ ఊరే నా ఊరనుకున్నా. ఈ మదుసులే నా మదుసులనుకున్నా. మీ వున్నానే ఇంకా బతికున్నా. మీరే దారి సూపెట్టండి". ఏడుస్తూ చిన్నయ్య కాళ్లు పట్టుకున్నది.

"అంతా నా చేతుల్లోనే ఉన్నట్లు ఏడుస్తావేం!" బూబమ్మ చేతుల్ని అవతలికి నెట్టాడు చిన్నయ్య.

అంతా గమనిస్తున్న చిన్నయ్య భార్య బూబమ్మ దుఃఖం చూసి జాలి పడింది. "అందరికీ మీరే రాస్తిరిగా. ఇదొక్కటే కుదరక పోతుందా?" అన్నది.

"అంతా మాటల్తో అవుద్దా. దానికి చాల తతంగం వుంది. ఈ ముసల్దాని వల్ల అయ్యేపనా!" గొణిగాడు చిన్నయ్య.

"దేవుడే మీ ఇంటికి దారి సూపెట్టాడనుకుని వచ్చినా! దేవుడు మంచిగా సూత్తాడు".

"సరే! ఫోటో కావాలి.... వుందా?"

"ఎవురుదయ్యా?"

"నా ముఖం! నీదేనే!"

"బుద్ధెరిగినాక తీయించుకోలా! ఎట్టా?" అన్నది భయంగా.

"పట్నం వెళ్లి తీయించుకురా".

"అమ్మో.... అంతదూరం ఎట్టా ఎల్లేది?"

"ఎవడి వీపుమీదన్నా ఎక్కికూర్చో" అన్నాడు కోపంగా. చిన్నయ్య ధోరణికి బూబమ్మ చిన్నబుచ్చుకున్నది.

"తెలీకదుగుతాను బాబూ! పుటోకి డబ్బులియ్యాలా?" అడిగింది.

"ఉత్తినే ఎవరు తీస్తారు. పది రూపాయలివ్వాలి".

"అమ్మో.... పదిరూపాయలే". గుండెమీద చెయ్యేసుకున్నది.

బూబమ్మ తన చేతులమీదుగా పదిరూపాయలు ఖర్చుపెట్టి ఎంతకాలమయిందో గుర్తుకూడా లేదు.

'పది రూపాయలు' ఒకటికి నాలుగుసార్లు గొణుక్కున్నది.

"ఫొటో వుంటేనే దరఖాస్తు. లేకుంటే కుదరదు. నాలుగైదు రోజుల్లో దరఖాస్తు పంపుకోవాలి. ఆ తర్వాత వీలుపడదు.... వెళ్లిక" అంటూనే చిన్నయ్య లోపలకు వెళ్లిపోయాడు.

బూబమ్మ అక్కడే నిలబడిపోయింది. కాసేపు కాళ్లుచేతులు ఆడలేదు. ఎంతో ఆశతో వచ్చిందేమో దిగాలు పడింది.

ఫొటోకి పదిరూపాయలుగాక పట్నం వెళ్లిరావటానికి రానుపోను చార్జీకి రెండు రూపాయలు కావాలి. అంత డబ్బు ఎక్కడిది! పదిమందిని ధర్మం అడిగి డబ్బులు పోగేసుకోవాలన్న ఆలోచన అప్పుడే బూబమ్మకి కలిగింది.

అప్పట్నుంచి రెండురోజులుగా ఊరంతా చెడ తిరుగుతూనే ఉన్నది. కనిపించిన వారినల్లా బ్రతిమలాడుకొంటూనే ఉన్నది.

ఫొటో తీయించుకోవాలి.

దరఖాస్తు చెయ్యాలి.

పింఛను తెచ్చుకోవాలి.

కాసేపన్నా నీడపట్టున కూర్చుని బడలిక తీర్చుకునే అవకాశం బూబమ్మకు చిక్కలేదు. ఎవరో అటుగా రావటం చూసి వేడుకున్నది. అతను ఛీత్కరించి వెళ్తుంటే రొప్పుతూ వెంటపడింది.

ఉన్న శక్తి కాస్త హరించుకు పోయిందేగాని ఫలితం దక్కలేదు. వీధి అరుగుమీద చతికిల పడింది. ఎండకు మాడుతున్న బండ మీద నిమిషం కూడా కూర్చోలేక పోయింది.

తిరిగే ఓపిక కూడా సన్నగిల్లింది. నిస్సత్తువతో శరీరం వణకసాగింది. కాళ్లీడ్చుకుంటూ ఇంటిదారి పట్టింది. ఆసాముల ఇళ్లముందు నడుస్తూ అన్నం ముద్దకోసం కేకలు పెట్టింది. కాస్త అన్నం, అందులోకి పచ్చడి దొరికింది.

గుడిసెలోకి వెళ్తానే పాతకుండలో చల్లని నీళ్లు సత్తుగ్లాసుతో ముంచుకుని ముఖం తడుపుకుంది. ప్రాణం కాస్త తెప్పరిల్లింది. ఆబగా నాలుగు ముద్దలు మింగి, మిగిలిన కొద్ది అన్నం మట్టి పిడతలో దాచుకున్నది.

చింకిచాప పరుచుకుని నడుం వాల్చింది. ఇట్టేకునుకు పట్టింది గాని మనసు స్థిమితం లేక ఎక్కువసేపు నిద్రపోలేదు.

లేస్తానే బొడ్లో దాచుకున్న డబ్బుల సంచి బయటకుతీసింది. కదిలించేసరికి సంచి బరువుగా గలగల్లాడింది. ఎంత పోగయిందీ ఇంతవరకు లెక్కించనే లేదు. బరువునుబట్టి సరిపోను వున్నాయనే అనుకున్నది.

చాపమీద సంచి గుమ్మరించింది. అటూ ఇటూ దొర్లినయ్యేమోనన్న అనుమానంతో తడిమి ఒక చోటకు పోగు పెట్టింది. ఒక్కో కాసు చేతితో తడుముతూ ఎంచసాగింది.

మొత్తం ఆరు రూపాయల పదిపైసలు లెక్క తేలింది. అనుకున్నంత లేకపోవటంతో నిరాశ పడింది. లెక్క తప్పిందేమోనన్న అనుమానం కలిగి లెక్కపెట్టింది. ఈసారి ఆర్రూపాయలే తేలింది. మళ్లీ లెక్కేసి ఆరూపదిపైసలే నికరమనుకున్నది.

ఇంకా ఐదూ తొంబై పైసలుంటేగాని సరిపోవు. మిగిలిన సొమ్ము ఎట్లా సంపాదించాలన్నదే బూబమ్మ సమస్య.

చల్లబడ్డాక ఊరిలోకి బయల్దేరింది. లోగడ ఇచ్చినవాళ్లే ఎక్కువమంది తారసపడి ఎన్నిసార్లిస్తామంటూ కసురుకున్నారు. ఇద్దరు మాత్రం చెరి పదిపైసలిచ్చారు.

చీకటిపడ్డాక అన్నం అడుక్కుని ఇంటిదారి పట్టింది.

ఉదయం తినగా మిగిలింది తిని, సాయంత్రం అడుక్కున్నది మాత్రం ముట్టకుండా దాచుకున్నది.

బూబమ్మ పడుకున్నా కంటిమీదకు కునుకురాలేదు. చాలీచాలని డబ్బుతో ఏం చెయ్యాలో తోచటం లేదు. రెండురోజులు ఆలస్యమయితే అవకాశం చేజారిపోతుంది. ఇట్లాంటి అవకాశం మళ్లీ వస్తుందో రాదో. కూలిపని చేసే సత్తువ ఎన్నడో చచ్చి పోయింది. అవసరం గనుక ఒకవేళ చేస్తానన్నా కూలి దండగ సొమ్మని తరుముతారు. ఎట్లా?

ఒక్కటే ఆలోచన బూబమ్మ మనసులో తళుక్కున మెరిసింది. కష్టమైనప్పటికీ తను చేయగలిగిన పని అదొక్కటేననుకున్నది.

సూర్యోదయం కాకముందే నిద్ర లేచింది. వీధి పంపునుండి కాసిని నీళ్లు తెచ్చుకుని ముఖం కడుక్కున్నది. చద్దన్నం కాస్త తిని మిగిలింది మూట కట్టుకున్నది. పాత చీర నడుముకు చుట్టుకుని పంట పొలాలకేసి బయల్దేరింది.

చాల భాగం పొలాల్లో వరికోసి కుప్పలు వేసి వున్నాయి. అక్కడక్కడా ఇంకా కుప్పలు వేస్తున్నారు. ఓదెలు మోసుకెళ్ళి కుప్ప వేసేటప్పుడు కంకులున్న పరకలు అక్కడొకటి అక్కడొకటి జారిపడుతుంటాయి.

బూబమ్మ ముక్కుతూ మూలుగుతూ పొలాల వెంటబడి తిరుగుతూ పరిగె పరకలు ఏరసాగింది. వరి మోదులు గుచ్చుకుని కాళ్ళు పచ్చి పుండ్లవుతున్నా ఖాతరు చేయలేదు.

మధ్యాహ్నం మోటబావి దగ్గర చతికిలబడి అన్నం మూటవిప్పుకొని మిగిలింది తిన్నది. కాసేపు సేదతీరి తిరిగి పొలాలమీద పడింది.

"ఏవే బూబమ్మ! పరిగె ఏరతన్నావా లేక దొంగ చాటుగా కుప్పల్లోంచి కంకులు దూస్తన్నావా?" అంటూ ఒకరిద్దరు గద్దించారు.

"అట్లాంటి పాడు పన్లు సేత్తానా!" అంటూ వాళ్ల మాటలకు నొచ్చుకున్నది.

సాయంత్రం దాకా ఏరిన పరిగె కంకుల్ని ఒక చోటకు చేర్చి గింజలు రాల్చింది. రాలిన గింజల్ని చూసుకుని సంతృప్తిపడింది. మూటగట్టి భుజాన వేసుకొని ఊరిలోకి బయల్దేరింది.

కిరాణా కొట్టుకు వెళ్లి ధాన్యం కొలవమన్నది.

తాలున్నదని కొట్లోనే ఒక మూలకు చెరిగించి కొంత ధాన్యం ఎగరగొట్టించాడు. కొలత కూడా చేతులడ్డం పెట్టి ఎక్కువ గింజలే కొలుచుకున్నాడు.

ఐదు రూపాయలిస్తానన్నాడు షావుకారు.

ఆరు రూపాయలిమ్మన్నది బూబమ్మ.

రాళ్లెక్కువని సణిగాడు. ఇందులో ఇంకా రద్దు వుందని నీలిగాడు. ఇంకా వంకలు పెట్టి ఐదున్నరకు మించి పైసా ఇవ్వను పొమ్మన్నాడు. షావుకారు ఇస్తానన్నంత పుచ్చుకోక తప్పలేదు.

రాత్రి మళ్లీ డబ్బులన్నీ లెక్క జూసింది బూబమ్మ. మొత్తం మీద ఇరవైపైసలు తగ్గింది. ఏమైతేనేం మర్నాడు ఫొటో తీయించుకోవటానికి పట్నం వెళ్లాలనే నిర్ణయించుకున్నది.

ఉదయం ఎనిమిది గంటలకల్లా పట్నం బస్సెక్కింది. బూబమ్మను ఆశ్చర్యంగా చూసేరంతా.

"కొడుకుల్ని చూడబోతున్నావేమిటి?" అడిగింది పెరుగు పుల్లమ్మ.

"అంత అదురుస్టం కూడానా! ఎక్కడెక్కడున్నారో ఆ ఊర్లే నాకు ఎరికలేదు" అన్నది నిట్టూరుస్తూ.

"మరెందుకెళ్తన్నట్లు?"

"ఫొటో తీయించుకోటానికి. సర్కారోల్లు పింఛనిత్తారంట". చెప్పింది.

కండక్టర్ వస్తే టిక్కెట్టు డబ్బులు జాగ్రత్తగా ఎంచి రూపాయి ఇచ్చింది. ఆలస్యానికి అతను ఒకటికి నాలుగుసార్లు విసుక్కున్నాడు.

పట్నంలో బస్సు దిగుతూనే పుల్లమ్మను బ్రతిమాలుకుంటే దగ్గర్లోనే ఉన్న ఫొటో స్టూడియో ముందు వదిలి వెళ్లింది. అప్పుడే అతను స్టూడియో తీస్తున్నాడు.

"మూడు కాపీలిస్తాం. పది రూపాయలవుద్ది". చెప్పాడతను.

"మూడక్కరలేదు. మూడు రూపాయలుచ్చుకుని ఒకటిస్తే సరిపోద్ది బాబయ్యా!" అన్నది బూబమ్మ.

"నీకు అవసరం ఉన్నా లేకపోయినా మేవిచ్చేది అంతే. ఇష్టమయితే తీయించుకో, లేకుంటే ఫో" అన్నాడు పొద్దుటే ఇదెక్కడి బేరం అనుకుంటూ.

"నా దగ్గర పది రూపాయల్లేవు. తొమ్మిది రూపాయలే ఉన్నాయి. బీద ముండని దయసూడు బాబూ!" వేడుకున్నది.

"ఇక్కడ బేరాలుండవు" అన్నాడు నిక్కచ్చిగా.

బూబమ్మ ప్రాధేయపడింది. "బాబయ్యా; అడుక్కుతినే ముండని. ఒక రూపాయి తగ్గించుకుంటే బసుకెళ్తా. అంత దూరం నడవలేను" అన్నది దీనంగా.

"నీదే బోణి!" అన్నాడు కాస్త మెత్తబడుతూ.

"బోణి అయ్యేదాకా కూకుంటాన్లే" అన్నది.

ముసల్ది గడుసుదేననుకుంటూ సరేనన్నాడు. నిజానికి అతను పదిమందిగా కలసి వచ్చి బేరమాడిన వాళ్లకు ఎనిమిది రూపాయలకే తీసేడు. ఈ మధ్య పింఛను గిరాకి బాగానే తగిలింది. చుట్టు పక్కల ఊళ్ల నుండి చాల మంది ఫొటోల కోసం ఎగబడ్డారు.

ప్రభుత్వం తలపెడ్తున్న అన్ని పనుల్లోకి అతనికి బాగా నచ్చినపని ఇదొక్కటె. వాళ్ల పుణ్యమా అని బాగానే సొమ్ము చేసుకున్నాడు. రెండు వారాలపాటు టీ నీళ్లు తాగే తీరిక

కూడా దొరకలేదు. ఫొటోలు తీసినతను తీసినట్లే వున్నాడు. భార్యకు, కూతురికి మాత్రం చెరో బంగారు గొలుసు చేయించగలిగాడు.

బోణీ అయిన తర్వాత బూబమ్మను పిలిచాడు. ముందుగానే తొమ్మిది రూపాయిలు వడుక్కున్నాడు.

కుర్చీలో కూర్చోబెట్టి కెమేరా సర్దుకుని, హైవోల్టేజి బల్బులు వెలిగించాక బూబమ్మకు కంగారెత్తి పోయింది.

"కాస్త నవ్వు ముసలమ్మా!" అన్నాడు క్లిక్ చేయబోతూ.

బూబమ్మ నవ్వాలని ప్రయత్నించింది గానీ నవ్వలేక పోయింది. విసుగొచ్చి అలానే ఫొటో తీసేడు.

తనెంత కష్టపడితే ఆ డబ్బులొచ్చినాయో తలుచుకుని, ఈ మాత్రానికే తొమ్మిది రూపాయలు పుచ్చుకున్నాడా అనుకున్నది.

"రేపు రా ఇస్తాను" అన్నాడు.

బూబమ్మ లబోదిబోమన్నది. మళ్లీ రావాలంటే బస్సుకు డబ్బులు లేవన్నది. ఈ పూటే ఇచ్చి పుణ్యం కట్టుకోమన్నది.

అట్లయితే సాయంత్రం దాకా కూర్చోమన్నాడు.

బూబమ్మ అక్కడే ఒక మూల చతికిల బడింది. ఉదయం తిన్నముద్ద కాస్త అరిగిపోయి మధ్యాహ్నానికల్లా ఆకలితో నకనకలాడింది. సంచిలో తడుముకుంటే రూపాయి ఎనభైపైసలు వున్నాయి.

బయటకొచ్చి ఒక పునుగుతిని టీ తాగింది. పదిహేను పైసలెట్టి పొగాకు కొనుక్కున్నది. బస్సుకు సరిగ్గా రూపాయి మిగుల్చుకున్నది. పొగాకుతో ఒక చుట్ట చుట్టుకుని చాటుగా కూర్చుని తాగి తతిమాది బొడ్లో దాచుకున్నది.

సాయంత్రానికి ఫొటోలు బూబమ్మ చేతిలో వుంచాడు. సంతోషంతో పొంగిపోయింది.

"చూసుకో ఎట్లాగున్నావో!" అన్నాడు.

బూబమ్మకు చూపు సరిగా ఆనలేదు. బొమ్మ మసకమసగ్గా కనిపించింది.

"నా బొమ్మేనా!" అన్నది.

"ఎవరి బొమ్మో ఎట్లా వస్తది ముసలమ్మా!" అన్నాడు.

"వస్తా బాబయ్యా!" అన్నది సంతోషంగా.

"మంచిది" అన్నాడు మరో గిరాకి తగిలేసరికి లోపలకు జారుకుంటూ.

చాలరాత్రి గడిచేదాకా బూబమ్మకు నిద్ర పట్టలేదు. వళ్లు నొప్పులు, అరికాళ్ల మంటలు సగం కారణమైతే ఫోటో తీయించుకోగలిగానన్న ఆనందం మిగతా కారణం. నిద్ర పట్టిన కాసేపు ఒకటే కలలు.

ఉన్నట్లుండి బూబమ్మ గుడిసె పెద్ద పెంకుటిల్లుగా మారిపోయింది. కొడుకులు, కోడళ్లు, పిల్లలతో ఇల్లంతా కళకళలాడుతున్నది. అందరి వంటిమీద కొత్త బట్టలు జిగేలు జిగేలు మంటున్నాయి.

ఉదయం లేస్తూనే మునసబు చిన్నయ్య ఇంటికి వెళ్లింది.

ఫోటోలు అతని చేతిలో వుంచి దణ్ణం పెట్టింది. చూస్తూనే చిన్నయ్య ఆశ్చర్యపోయాడు. ఈ పని ముసలమ్మకు ఇంత త్వరగా సాధ్యపడుతుందని అతను కలలో కూడా అనుకోలేదు.

"బాబయ్యా! బతికినంతకాలం నీ పేరు సెప్పుకుంటా!" అన్నది కళ్లనిండా కృతజ్ఞత నింపుకుని.

"సరే.... అట్లా కూర్చో!" అన్నాడు చిన్నయ్య.

నేలమీదనే చతికిలబడింది బూబమ్మ. ఆమె కళ్లు ఆశతో నక్షత్రాల్లా మెరుస్తున్నాయి.

చిన్నయ్య లోపలికెళ్లి దరఖాస్తు తెచ్చాడు. కావలసిన వివరాలన్నీ అడిగి రాసుకున్నాడు. జిగురుపూసి ఫొటో అంటించాడు. బూబమ్మ చేత వేలిముద్రలు వేయించాడు.

"గవర్నమెంటుకి పంపిస్తాన్లే నువ్వెళ్లిక" అన్నాడు మిగిలిన రెండు ఫొటోలు చేతిలో పెడ్తూ. "నాకెందుకు బాబయ్యా! అవుసరముంటదేమో వుంచు" అన్నది.

"పన్లేదులే. నీ కొడుకులకు పంపు. అద్దం కట్టించి గోడకు తగిలించుకుంటారు" నవ్వేడు చిన్నయ్య.

బూబమ్మ నవ్వలేదు.

"ఎన్నాల్ల కొత్తయి బాబూ!" అడిగింది.

"అంత తేలిగ్గా అవుద్దా. నీలాంటోళ్లు వేలమంది. తనిఖీ జరగాలి. మంజూరు కావాలి. ఎన్నాళ్ళవుద్దో" అన్నాడు చిన్నయ్య.

బూబమ్మ సంతృప్తిగా ఇంటిదారి పట్టింది.

దరఖాస్తు పెట్టేందుకు పడిన శ్రమ బూబమ్మను వారం రోజులపాటు జ్వారాన పడేసింది. మందూమాకూ లేకుండా బాధపడింది.

కోలుకున్న తర్వాత ఏదన్నా కబురు తెలుస్తుందేమోనని రోజూ ఎదురు చూడటమే. ఒక నెలరోజులు ఓపికపట్టి చిన్నయ్య కోసం వెళ్లింది.

"ఏవన్నా తెల్సిందా బాబయ్యా!" ఆశగా అడిగింది.

"ఏ సంగతే?" అన్నాడు పరధ్యానంగా.

"పింఛను డబ్బు సంగతి."

"పంపి ఎన్నాళ్లయిందే! ఈ నెల్లో తెలుస్తుందేమో!"

"సర్కారోల్లకు నువ్వో ఓ మాట సెప్పు. వంటరి పచ్చిని, దయసూడమను" అన్నది బేలగా.

"సర్లే! వెళ్లెళ్లు పనివుంది." అన్నాడు విసుగ్గా.

సత్తార్ భార్యగా బూబమ్మ ఆ ఊరిలోకి అడుగుపెట్టి అరవయ్యేళ్లయింది. ఐదుగురు బిడ్డల తల్లయింది. భార్యా భర్తల కష్టం తిండికి సరిపోయేది.

బిడ్డలకు రెక్కలొచ్చాక గూళ్లూ వేరయ్యాయి. ఒక్కగానొక్క కూతురికి పెళ్లిచేసి పంపితే మొదటి కానుపు కష్టమై చచ్చిపోయింది. నలుగురు కొడుకులు పొట్టతిప్పల కోసం నాలుగూళ్లు వెళ్లారు. చేతనైన పనులు చేసుకుంటూ ఎవరి బతుకులు వాళ్లు బతుకుతున్నారు.

పదేళ్ళక్రితం సత్తార్ జబ్బుచేసి చనిపోయాడు. బూబమ్మ ఒంటరిదయింది. పెద్దకొడుకు రమ్మన్నాడుగాని వెళ్లనంది. బస్తీలో వాడికష్టం బిడ్డల పొట్టలకే చాలనప్పుడు తనెందుకు వాడికి బరువవటం అనుకున్నది.

కండరాలలో శక్తికి, కడుపులో ఆకలికి అవినాభావ సంబంధం లేదు గనుక వయసు ముదిరి పనిచేసే శక్తి సన్నగిల్లి పోయినా ఆకలి మాత్రం ఎప్పటిలానే వున్నది. కూచుంటే సరిగా లేవలేని మనిషి కాయకష్టం ఎలా చేయగలుగుతుంది. ఊరిలో వాళ్ళ దయా ధర్మం మీద బతక్క తప్పలేదు.

ఏడాదికో రెండేళ్లకో కొడుకుల్లో ఎవరో ఒకరు తొంగిచూసి ఒకపూట వుండిపోతారు. బలవంతంగా ఐదో పదో చేతిలోపెట్టి పోతుంటారు. అది మాత్రం ఎన్నిపూటల కొచ్చేను?

వచ్చే పింఛను డబ్బులు ఎట్టా ఖర్చు పెట్టుకోవాలో ఇప్పట్నుంచే లెక్కలు వేసుకుంటున్నది బూబమ్మ.

మొగుడు బతికున్న రోజుల్లో కూలిడబ్బులు కాస్త చేతిలో గట్టిగా ఆడితే పచ్చివో ఎండువో చేపలు తెచ్చుకుని లొట్టలేసుకుంటూ తిన్నరోజులు గుర్తొస్తున్నాయి.

చేప పులుసంటే బూబమ్మకు వల్లమాలిన ప్రాణం. డబ్బు రాగానే బొచ్చెచేప ఒకటికొని తెచ్చుకొని ఎవరోకర్ని బ్రతిమాలి వండించుకు తినాలన్న వుబలాటం కలగసాగింది.

రెండేళ్లుగా కొడుకులు ఒక్కడూ రాలేదు. పసిగుడ్డులుగా వున్నప్పుడు చూసింది వాళ్ల పిల్లల్ని. వాళ్లందరూ కళ్లల్లోమెదులుతున్నారు.

ఈ ముసలి ప్రాణం ఎప్పుడు గుటుక్కుమంటదో! నాలుగైదు నెలలపాటు వచ్చిన డబ్బంతా జాగ్రత్తగా కూడబెట్టి ఏ రంజాన్ పండగకో ఉత్తరాలు రాయించి కొడుకులందర్నీ పిలిపించాలని వున్నది. అందర్నీ కనులారా చూసుకుని అల్లా పండగ ఘనంగా చేయాలనుకుంటున్నది.

ఊరిలో కొందరికి పింఛను డబ్బు ఇస్తున్నారని తెలిసి చిన్నయ్యను వెతుక్కుంటూ బయల్దేరింది. మధ్యదారిలోనే ప్రెసిడెంటుగారి తమ్ముడితో ముచ్చటిస్తూ కనిపించాడు చిన్నయ్య.

"బాబయ్యా! పింఛను ఇస్తన్నారంట" అడిగింది బూబమ్మ.

"అందరికీ ఒకేసారి ఇస్తారా! గవర్నమెంట్ దగ్గర డబ్బుండొద్దూ! నిదానంగా నీకూ వస్తదిలే" అన్నాడు చిన్నయ్య.

బూబమ్మ నిరాశగా తిరుగు ముఖం పట్టింది.

"ఈ ముసల్దానికి నువ్వు దరఖాస్తు రాయించావా! మొన్నటి ఎలక్షన్లలో దీన్ని మా అన్నకు ఓటెయమంటే ఎంత నీలిగిందో నీకు తెలీదూ? ఆ పాత ప్రెసిడెంటు బుల్లయ్యకుకాదూ ఇది ఓటేసింది?" అడిగాడు అతను.

"అదంతా నాకు తెలీకనా!" అన్నాడు చిన్నయ్య నవ్వుతూ.

"మరి దీనికెందుకు రాసిచ్చావు" అన్నాడు విసురుగా.

ఫకాల్న నవ్వేడు చిన్నయ్య. "ఇంటిచుట్టూ ఒకటే తిరిగింది ముసల్ది. మనం కుడి చేత్తో చేసేది ఎడం చేతికి తెలీకూడదు గదా దాని ముందు రాసినట్లే రాసి, వేలిముద్రలూ అవీ వేయించి, అది అటెళ్లగానే చింపి అవతల పడేశాను" అన్నాడు చిన్నయ్య.

చిన్నయ్య వ్యవహారదక్షతకు ప్రశంసాపూర్వకంగా కనులెగరేశాడు ప్రెసిడెంటు తమ్ముడు.

*(విపుల, మే 1987)*